నమస్తే తెలంగాణ
# నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 28 జనవరి 2025 | NAGARKURNOOL


అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు

- అచ్చంపేట మార్కెట్ కార్యాలయం ముట్టడి
- ఫర్నీచర్ ధ్వంసం, సెక్రటరీ, చైర్‌పర్సన్ భర్తపై దాడి
- భయంతో బయటకు పరుగులు తీసిన అధికారులు
- పట్టణంలోని ప్రధాన రహదారిపై నిరసన
- ఒకే పంటకు రెండు ధరలు ఎలా నిర్ణయిస్తారని నిలదీత
- అధికారులతో సమాధానం కరువు
- మద్దతు ధర ఇచ్చే వరకు కొనుగోలు నిలిపివేయాలని డిమాండ్
- కల్వకుర్తిలోనూ వేరుశనగ రైతుల ఆందోళన

# పల్లీ రైతుల కన్నెర్ర

అచ్చంపేట/అచ్చంపేట టౌన్, జనవరి 27 : ఆరుగాలం కష్టించి పండించిన పంటను వ్యాపారులు, అధికారులు కుమ్మక్కై ఒక్కసారిగా ధరలు తగ్గించడంతో రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. రైతులను నిలువు దోపిడీ చేస్తూ వ్యాపారస్తులు మార్కెట్‌కు తెచ్చిన వేరుశనగ పంట నాణ్యతను గుర్తించకుండా తక్కువ ధరలు నిర్ణయించడంపై కోపోద్రిక్తులయ్యారు. సోమవారం అచ్చంపేట, ఉప్పునుంతల, బల్మూర్, అమ్రాబాద్ ఇతర మండలాల నుంచి రైతులు అచ్చంపేట మార్కెట్‌కు వేరుశనగ పంటను తీసుకొచ్చారు. మూడు రోజుల కిందట వేరుశనగ క్వింటాకు మద్దతు ధర రూ.7వేల పైచిలుకు ఉండగా, ఒక్కసారిగా సోమవారం రూ.4వేల వరకు తగ్గించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయాన్ని ముట్టడించారు. మార్కెట్ చైర్‌పర్సన్ అంతటి రజిత భర్త అంతటి మల్లేశ్ రైతులతో మాట్లాడుతుండగా ఒక్కసారిగా దాడి చేశారు. చొక్కా పట్టి లాగడంతో చినిగిపోయింది. భయాందోళనకు గురై కార్యాలయంలోకి పరుగెత్తగా వెంబడించారు. సెక్రటరీ నర్సింహులుపై సైతం దాడి చేశారు. ఆగ్రహంతో రైతులు కార్యాలయంలోకి వెళ్లి కుర్చీలు, ఫర్నీచర్, అద్దాలు ధ్వంసం చేశారు. చేతికందిన వాటినన్నింటినీ పగులగొట్టారు. ఒక్కసారిగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అక్కడి నుంచి రైతులు పెద్ద సంఖ్యలో అంబేద్కర్ చౌరస్తాకు వెళ్లి ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించడంతో వాహనాలు భారీగా నిలిచి పోయాయి. అచ్చంపేట ఎస్సై రమేశ్ రైతులతో మాట్లాడి అక్కడి నుంచి మార్కెట్‌కి తీసుకెళ్లి వ్యాపారస్తులతో మాట్లాడి చర్చలు జరుపుతామని సముదాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాత్రింబవళ్లు కష్టపడి చమటోడ్చి పండించిన పంటను అమ్ముదామని మార్కెట్‌కు తీసుకొస్తే నాణ్యతను పరిశీలించకుండా ఇష్టమొచ్చిన రేటును నిర్ణయిస్తూ తూకాల్లో మోసాలు చేస్తూ అడుగడుగునా అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఒకే రైతుకు చెందిన పంటను రెండు కుప్పలను విక్రయానికి తీసుకురాగా, వేర్వేరు ధరలు నిర్ణయించడంపై రైతు ఎస్సై ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. ఒకే పంటకు రెండు ధరలు ఎలా వేస్తారని ప్రశ్నించారు. మార్కెట్‌లో జరుగుతున్న మోసాలను అరికట్టి న్యాయం జరిగే వరకు కొనుగోలు నిలిపి వేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఒక్కసారిగా రైతులు కార్యాలయంపై దూసుకురాగా, కార్యాలయంలో ఉన్న సిబ్బంది భయంతో బయటికి పరుగులు పెట్టారు. పోలీసులు రైతులను అదుపుచేసినా ఫలితం లేక పోయింది. ప్రభుత్వం, అధికారులు దిగివచ్చి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.


రైతుల దాడిలో ధ్వంసమైన అద్దాలు

## మద్దతు ధర కల్పించాలి

కల్వకుర్తి రూరల్, జనవరి 27 : ఆరుగాలం శ్రమించి పండించిన పల్లీ పంటకు మద్దతు ధర కల్పించాలని కల్వకుర్తి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో వేరుశనగ రైతులు సోమవారం ధర్నా చేపట్టారు. సోమవారం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డుకు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి రైతులు పల్లీలను తీసుకురాగా, వ్యాపారులు సరైన ధరను టెండర్ చేయకపోవడంతో హైదరాబాద్ చౌరస్తాకు చేరుకొని ధర్నాకు దిగారు. ఇతర మార్కెట్ యార్డుల్లో పల్లీకి మద్దతు ధర దాదాపు 7,500 వరకు ఉండగా, కల్వకుర్తిలో మాత్రం రూ.5వేలు ఎలా చెల్లిస్తారంటూ ప్రశ్నించారు. మార్కెట్ యార్డులోని వ్యాపారులు రైతులను మోసం చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పేరుకు మాత్రమే రైతుల ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటూ సరైన మద్దతు ధరను ఇవ్వకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ సర్కారులో రైతులను రాజుగా నిలబెట్టారన్నారు. వ్యాపారులు కావాలనే పల్లీకి ధరను తగ్గించారని ఆరోపించారు. మద్దతు ధర అందించాలని, లేదంటే రీటెండరింగ్ చేయించాలని కోరారు. విషయం తెలుసుకున్న వెల్దండ సీఐ, కల్వకుర్తి పోలీసులు వ్యవసాయ మార్కెట్ పాలక మండలి సభ్యులు రైతులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. అదే సమయంలో మార్కెట్ యార్డుకు చేరుకున్న రాష్ట్ర వ్యవసాయ కమిటీ సభ్యుడు కేవీఎన్ రెడ్డి రైతులను నచ్చజెప్పేందుకు ప్రయత్నించగా, రైతులు సీఎం డౌన్ డౌన్.. వద్దురా కాంగ్రెస్ పాలన అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఏఎంసీ సభ్యులు వ్యాపారులతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా మద్దతు ధరను అందించేలా చూడాలన్నారు.


రైతుల దాడిలో గాయపడిన మార్కెట్ కార్యదర్శి


కల్వకుర్తిలో మద్దతు ధర కోసం ఆందోళన చేస్తున్న పల్లీ రైతులు


పెబ్బేరులో క్రీడలను ప్రారంభించి మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

# కేసీఆర్ హయాంలో క్రీడలకు ప్రోత్సాహం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు, జనవరి 27 : కేసీఆర్ సర్కారులోనే క్రీడలకు ప్రోత్సాహం లభించిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. పెబ్బేరులో చౌడేశ్వరీ జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన పీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అప్పట్లో గ్రామగ్రామాన క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అలాగే, పెబ్బేరులోనూ జూరాల క్యాంపు కాలనీలో అప్పటి సీఎం కేసీఆర్‌ను ఒప్పించి ఇరిగేషన్ శాఖకు చెందిన విలువైన పది ఎకరాల స్థలాన్ని మున్సిపాలిటీకి అప్పగించి అందులో మౌలిక వసతుల కోసం రూ.10కోట్లను మంజూరు చేయించినట్లు తెలిపారు. పెబ్బేరులో చౌడేశ్వరీ ఉత్సవాల సందర్భంగా 16 సంవత్సరాలుగా హనుమాన్, ఆజాద్ యూత్ వారు క్రికెట్ పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కరుణశ్రీ, మాజీ వైస్ చైర్మన్ కర్రెస్వామి, మండలాధ్యక్షుడు రాములు, సింగిల్ విండో అధ్యక్షుడు జగన్నాథం, నాయకులు వెంకటేశ్, రాజశేఖర్, విశ్వరూపం, ఎల్లారెడ్డి, ఎల్లయ్య, మజీద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# బీటీ రోడ్డు నిర్మించాలి

- ముత్తిరెడ్డిపల్లి గ్రామస్తులు నిరాహారదీక్ష


కోడేరు : ముత్తిరెడ్డిపల్లిలో నిరాహారదీక్ష చేస్తున్న గ్రామస్తులు

కోడేరు, జనవరి 27 : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని నాగులపల్లి, ముత్తిరెడ్డిపల్లి, తుర్కదిన్నె గ్రామాల మీదుగా బీటీ రోడ్డు నిర్మించాలని ముత్తిరెడ్డిపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం ముత్తిరెడ్డిపల్లిలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శరత్‌చంద్రారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ ముత్తిరెడ్డిపల్లికి సరైన రోడ్డు సౌకర్యం లేక పోవడంతో అత్యవసర సమయాల్లో దవాఖానలకు తీసుకువెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని, ఈ రోడ్డు కారణంగా సమయానికి దవాఖానకు తీసుకువెళ్లకే పలువురు మృతువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి బీటీ రోడ్డు వేయాలని కొన్నేండ్ల నుంచి అధికారులు ప్రజాప్రతినిధులను కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆమరణ నిరాహారదీక్ష చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆర్‌అండ్‌బీ డీఈ రమాదేవి వారం రోజుల్లో గ్రామంలో బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు దీక్ష విరమించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు చేసే వరకు దీక్షలు



పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో నిరసన

రాజోళి, జనవరి 27 : మండలంలోని పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలంటూ 5వ రోజు నిరాహార దీక్షలు చేపట్టారు. మండలంలోని గ్రామాలకు చెందిన రైతులు మద్దతు తెలిపారు. పెద్ద ధన్వాడలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే మండలంలో పంటలు నాశనం అవుతాయన్నారు. పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాల నుంచి ప్రజల ప్రాణాలకే ప్రమాదమన్నారు. ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేసే వరకు దీక్షలు కొనసాగుతాయని చెప్పారు.

# బోనస్ డబ్బులు ఇవ్వాలి

ధన్వాడ, జనవరి 27 : వడ్లు విక్రయించి నెల రోజులు గడుస్తున్నా నేటికి బోనస్ డబ్బులు రాలేదని సోమవారం సింగిల్ విండో కార్యాలయం ఎదుట మండలంలోని గోటూర్, మందిపల్లి, కంసానిపల్లి గ్రామాలకు చెందిన రైతులు నిరసన తెలిపారు. నెల రోజుల నుంచి సింగిల్ విండో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, నర్సిరెడ్డి, నాగయ్య, శ్రీనివాసులు, రాఘవేందర్, నాగిరెడ్డి, రఘు పాల్గొన్నారు.


ధన్వాడ పీఏసీసీఎస్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

# వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

గద్వాల అర్బన్, జనవరి 27 : గుట్టుగా నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేసిన ఘటన సోమవారం గద్వాలలో చోటుచేసుకున్నది. గద్వాల టౌన్ ఎస్సై కల్యాణ్‌కుమార్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బీరెల్లి చౌరస్తా సమీపంలో ఓ ఇంట్లో కడప ప్రాంతానికి చెందిన రమణయ్య గౌడ్ ఓ ఇంటిని అద్దెకు తీసుకొని గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టి నిర్వాహకుడితోపాటు ఇద్దరు మహిళలు, విటులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

# గోపాల్‌పేట హాస్టల్ విద్యార్థి మృతి


విద్యార్థి మృతదేహంతో రోడ్డుపై బైఠాయించిన ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

- మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి నిరసన
- ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని విద్యార్థి సంఘాల డిమాండ్
- బాధిత కుటుంబానికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పరామర్శ

గోపాల్‌పేట, జనవరి 27 : సాంఘిక సంక్షేమ హాస్టల్‌కు చెందిన విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలోని ఏదుట్లలో చోటుచేసుకున్నది. కాగా, విద్యార్థి మృతిపై కుటుంబ సభ్యులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఏదుట్లకు చెందిన వెంకటస్వామి, అరుణ దంపతులకు ఇద్దరు కుమారులు. వెంకటస్వామి హైదరాబాద్‌లోని లింగంపల్లిలో రెండేండ్ల కిందట తాపీ పని చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. అప్పటి నుంచి అరుణ కూలీ పనులు చేసుకొని పిల్లలను పోషిస్తుంది. పెద్ద కుమారుడు భరత్(13) గోపాల్‌పేట ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం హాస్టల్‌లో భరత్ కాలకృత్యాలు తీర్చుకొని, స్నానం చేసి స్టడీ అవర్‌లో విద్యార్థులతో కలిసి చదువుకుంటున్నాడు. అకస్మాత్తుగా కిందపడి పోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వనపర్తి ప్రభుత్వ దవాఖానకు తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు దవాఖాన వద్దకు చేరుకొని మృతదేహాన్ని ప్రధాన రహదారిపై ఉంచి కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేశారు. బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు హేమంత్ మాట్లాడుతూ.. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితులపై ప్రభుత్వానికి పట్టింపు లేక పోవడంతో వరుస ఘటనలు చోటుచేసుకుంటున్నాయని మండిపడ్డారు. ఘటనా స్థలానికి ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డీఎస్పీ వెంకటేశ్వర్లు చేరుకొని విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు. మృతుడి తల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**మాజీ మంత్రి పరామర్శ..**

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విద్యార్థి మృతి విషయం తెలుసుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

# జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక


జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

వనపర్తి టౌన్, జనవరి 27 : ఇటీవల నల్లగొండ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హాకీ క్రీడల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారులు పాల్గొని రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని వనపర్తి జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు, కోచ్ మన్నెం తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో నిర్వహించే అండర్-19 జాతీయస్థాయి హాకీ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. జాతీయస్థాయి హాకీ పోటీలకు బాలికల విభాగంలో మమత, జోసెఫ్ సునైనా, సింధూర, నీలావతి, శ్రీవాణి ఎంపిక కాగా, బాలుర విభాగంలో విజయ్, అర్జున్ టెండూల్కర్, దినేశ్ సాగర్, జయసూర్య ఎంపికైనట్లు తెలిపారు. సోమవారం వీరిని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జి.సురేందర్‌రెడ్డి, తెలంగాణ హాకీ అసోసియేషన్ జాయింట్ కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి బోలమోని కుమార్, జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ నిరంజన్‌గౌడ్ విద్యార్థులను అభినందించారు.

## కోచ్‌గా మన్యంయాదవ్..

పెద్దమందడి, జనవరి 27 : జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2 వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగే జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనే తెలంగాణ హాకీ జట్టుకు కోచ్‌గా పెద్దమందడి ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మన్యం యాదవ్ ఎంపికయ్యారు. కోచ్‌గా ఎంపికైన మన్యం యాదవ్‌ను వనపర్తి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుమార్, కోశాధికారి నిరంజన్‌గౌడ్, హెచ్‌ఎం శాంతన్న ఉపాధ్యాయులు అభినందించారు.

# ధరల్లో దగా..

- టెండర్‌దారులంతా కుమ్మక్కు
- దోపిడీకి గురవుతున్న వేరుశనగ రైతు
- క్వింటాకు రూ.5వేలకు పడిపోయిన ధరలు

వనపర్తి, జనవరి 27 (నమస్తే తెలంగాణ) : వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో టెండరుదారులు చెప్పిందే ధర అన్నట్లు కొనసాగుతున్నది. గతంలో ఎప్పుడూ లేనంతగా ప్రస్తుత వేరుశనగకు ధరలు తగ్గిపోయాయని సోమవారం రైతులు లబోదిబోమన్నారు. పదేండ్ల కిందటే యాసంగిలో వేరుశగకు ఈ ధరలతో అమ్ముకున్నామని రైతులు ఆవేదన చెందారు. వనపర్తి మార్కెట్ యార్డుకు 350 మంది రైతులు 5వేల క్వింటాళ్ల వేరుశగను తీసుకొచ్చారు. వ్యాపారులు పూర్తిగా ధరలు తగ్గించేశారు. కేవలం ఒకటి, రెండు వేరుశనగ చిన్న కుప్పలకు మాత్రమే రూ.6వేలు వేసి ఇతర రైతులను తుంగలో తొక్కారు. మిగిలిన రైతులందరికీ కేవలం 4 నుంచి రూ.5వేలకు క్వింటాకు ధరలు వేసి రైతులకు నష్టం మిగిల్చారు. ఈ ఒక్క రోజు మార్కెట్ వచ్చిన ధాన్యం ధరలను పరిశీలిస్తే.. వ్యాపారుల జిమ్మిక్కులు చెప్పకుండానే అర్థమవుతాయి. మొత్తం 350 మంది రైతుల్లో 20 మంది రైతులకు చెందిన 300 క్వింటాళ్లకు మాత్రమే రూ.6వేల ధర వేసి ఎక్కువ ధరగా చెప్పుకున్నారు. ఇక మిగిలిన మరో 230 మందికి రూ.5వేలు క్వింటాకు ధర వేయగా, ఇంకో 100 మంది రైతులకు కేవలం రూ.4వేలకు పైబడి క్వింటాకు ధరలు వేశారు. కేవలం 10 నుంచి 20 క్వింటాళ్లలో ఉండే బొడ్డెలకు మాత్రమే ఎక్కువ ధర వేసినట్లుగా చేసి 200 క్వింటాళ్ల వరకు వేరుశగ తెచ్చిన రైతులకు తక్కువ ధరలు వేసి కుచ్చుటోపీ పెట్టారని రైతులు బావురుమన్నారు. అయితే, వేరుశనగకు తక్కువ ధరలు వేశారని మార్కెట్ కార్యదర్శి సరోజ దృష్టికి తెచ్చి పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ ధరలు వచ్చిన రైతులు రేపు, ఎల్లుండి మార్కెట్‌కు సెలవు ఉన్నందున గురువారం వరకు ఉంటే మళ్లీ టెండరు పెట్టిస్తామని చెప్పడంతో రైతులు చేసేదేమీలేక నిరాశతో వెనుదిరిగారు. మొత్తంగా వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ రైతు మాత్రం ధరలతో దగా పడుతున్నాడు.


వనపర్తి వ్యవసాయమార్కెట్‌కు విక్రయానికి భారీగా వచ్చిన వేరుశనగ

## పదేండ్ల కిందటే ఈ ధరకు అమ్మాం..



పదేండ్ల కిందటే ఈ ధరలు బుడ్డలు అమ్ముకున్నాం. 6 ఎకరాల్లో విత్తనం వేసి 130 సంచులు మార్కెట్‌కు బుడ్డలు తెచ్చినం. తీరా ధర చూస్తే రూ.5,500లు క్వింటాకు ఇచ్చిండ్రు. రైతులను దగా చేస్తున్నారు. ఇంత ఘోరమైన పరిస్థితులు గతంలో ఎప్పుడూ లేవు. రైతులు అప్పులు మీద వేసుకోవాల్సిందే.

**– రేవల్లి రాములు, రైతు, కాశీంనగర్, వనపర్తి మండలం**

## టెండరుదారుల కుమ్మక్కు..



వ్యాపారులంతా కుమ్మక్కు కావడంతోనే ధరలు రావడం లేదు. 180 సంచుల వేరుశనగ తెచ్చా. కేవలం రూ.4,500 క్వింటాల్ ధర వేశారు. మార్కెట్ కార్యాలయంలో అడిగితే కంప్యూటర్లు పని చేయడం లేదని తప్పించుకుంటున్నారు. వరికి ప్రభుత్వ మద్దతు ధర ఉన్నట్లుగానే వేరుశగకు మద్దతు ధర పెట్టాలి. ఇంత తక్కువ ధరలు ఎప్పుడూ చూడలేదు.

**– రఘువర్ధన్‌రెడ్డి, రైతు, దొడగుంటపల్లి, పెద్దమందడి మండలం**

## ఎక్స్‌పోర్టు లేనందునా..

గతంలో ఇతర రాష్ట్రాలకు ఇక్కడి వేరుశనగ ఎక్స్‌పోర్టు అయ్యేది. అప్పట్లో ధరలు కూడా బాగా ఉండేవి. ప్రస్తుతం వేరుశనగకు ధరలు తక్కువగా ఉన్నాయి. ఇతర మార్కెట్‌లను కూడా పరిశీలిస్తున్నాం. ఇతర ప్రాంతాల కంటే ఇక్కడ తక్కువ ధరలు లేకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నాం. మహారాష్ట్రకు ఎక్కువగా ఈ ప్రాంతం నుంచి వేరుశనగ వెళ్లేది. ప్రస్తుతం బయటినుంచి టెండరుదారులు రావడం లేదు.

**– శ్రీనివాస్‌గౌడ్, చైర్మన్, వ్యవసాయ మార్కెట్, వనపర్తి**